# పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

● శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి



మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి

హాలియా, డిసెంబర్ 14 : అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి సూచించారు. హాలియా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ టీచర్లకు గురువారం స్థానిక రైతువేదికలో పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడపిల్లల విక్రయాలు, బాల్యవివాహాలు, లింగవివక్ష, మహిళా సాధికారిత, లైంగిక వేధింపులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లల తల్లిదండ్రులకు ప్రతి శుక్రవారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. వయస్సుకు తగిన ఎత్తు, బరువులేని పిల్లలను గుర్తించి వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే కోఆర్డినేటర్ సునీత, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీశ్, సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ రమాదేవి, సరిత, వెంకాయమ్మ, గౌసియాబేగం, విజయలక్ష్మి, నాగమణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

## 16న మహాలక్ష్మమ్మ జాతర

చందంపేట, డిసెంబర్ 14 : ఈ నెల 16, 17 తేదీల్లో మహాలక్ష్మమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి సభావత్ మోతీలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందంపేట మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రతి ఏడాది జాతరను నిర్వహిస్తున్నట్లు, అందులో భాగంగానే ఈ ఏడాది జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. 16న అమ్మవారికి నైవేద్యం, 17న జాతర కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.


ఉత్సవాలకు ముస్తాబైన మహాలక్ష్మమ్మ ఆలయం

# ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ


ముకుందాపురం కంపోస్ట్‌షెడ్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

నిడమనూరు, డిసెంబర్ 14 : మండలంలో పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై గురువారం సామాజిక తనిఖీ బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. ఆగస్టు 1, 2021 నుంచి మార్చి 31, 2023 వరకు చేపట్టిన రూ.6.58 కోట్ల పనులపై డీఆర్‌పీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ ఆయా పనుల కొలతలను సేకరిస్తున్నాయి. పథకం కింద చేపట్టిన పంట కాల్వల పూడిక తీత, కంపోస్ట్ షెడ్ల నిర్మాణం, రోడ్లు, ఉద్యాన పంటల ప్రోత్సాహం కింద దశల వారీగా చేపట్టిన పనుల్లో పారదర్శకతను తేల్చేందుకు వివరాలు సేకరిస్తున్నాయి. నిధుల ఖర్చు పారదర్శకంగా జరిగిందా అనే విషయాన్ని పరిశీలిస్తున్నాయి. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటికే రాజన్నగూడెం, ముకుందాపురం, నందికొండ వారి గూడెం, వల్లభాపురం, మారుపాక, ముప్పారం, ఎర్రబెల్లి, ఊట్కూరు గ్రామాల్లో సామాజిక తనిఖీ పూర్తవగా 21 పంచాయతీల్లో తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీలు పూర్తయిన తర్వాత ఈ నెల 20న సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పాఠశాలల పరిశీలన


గోవిందన్నగూడెం పీఎస్‌ను పరిశీలిస్తున్న తాసీల్దార్ కృష్ణయ్య

నిడమనూరు, డిసెంబర్ 14 : కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం మండల కేంద్రంలోని గోవిందన్నగూడెం, కట్టవారిగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం తాసీల్దార్ జంగాల కృష్ణయ్య పరిశీలించారు. పోలింగ్ కేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల కంటే అధిక దూరం ఉన్న గ్రామాల్లో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అనుకూలతలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించిన అనంతరం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆయన తెలిపారు. తాసీల్దార్ వెంట ఎంపీఓ పల్లెబోయిన రామలింగయ్య, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ దాడి రాజిరెడ్డి, సర్వేయర్ విజయ్‌కుమార్ ఉన్నారు.

## మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన పాశం గోపాల్‌రెడ్డి


మాజీ మంత్రి హరీశ్‌రావుతో బీఆర్‌ఎస్ నాయకులు

గుర్రంపోడ్, డిసెంబర్ 14: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా మరోమారు విజయం సాధించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావును కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు పాశం వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బచ్చనబోయిన శ్రీను, దుండిగళ్ల వెంకటేశ్వర్లు, గిరి సతీశ్, మల్లోజు శ్రీనివాసచారి, బొడ సురేశ్, మల్లోజు నాగార్జునాచారి, అమరవాది ఇస్తారి, టేకులపల్లి యాదయ్య ఉన్నారు.

## అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు : ఎఫ్‌ఆర్‌ఓ

చందంపేట, డిసెంబర్ 14 : అడవి జంతువులను వేటాడినా, వాటిని వేటాడేందుకు అక్రమంగా కరెంటు తీగలు అమర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్‌ఓ సాయి ప్రకాశ్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పెద్దమూల, కంబాలపల్లి, రేకులవలయం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో జంతువులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించొద్దని, అటవీ ప్రాంతంలో పశువులను మేపవద్దని సూచించారు. అటవీ ప్రాంతం సమీపంలోని పొలాల్లో పల్లీ సాగు చేస్తున్న రైతులు రాత్రి సమయాల్లో కరెంటు తీగలు ఏర్పాటు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి చర్యలను మానుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో ప్రతి రోజు బీట్ అధికారుల గస్తీ ఉంటుందని పేర్కొన్నారు.

## రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ

మాడ్గులపల్లి, డిసెంబర్ 14 : కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సైదానాయక్ కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. రైతులు తమ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో పాటు దరఖాస్తు పత్రాన్ని జతచేసి ఏఈఓకు అందించాలని సూచించారు.

## నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ నివాసం స్వాధీనం


ఇంటి తాళం పగులగొడుతున్న ఎన్నెస్పీ అధికారులు

నందికొండ, డిసెంబర్ 14 : నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ కర్ర అనుషారెడ్డి నివాసముంటున్న హిల్‌కాలనీలోని ఈఈ–22 క్వార్టర్స్‌ను గురువారం ఎన్నెస్పీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో తాళం పగులగొట్టిన అధికారులు ఇంట్లోని సామగ్రిని పెద్దవూర ఇన్‌చార్జి తాసీల్దార్ జయశ్రీ సమక్షంలో పంచనామా నిర్వహించిన అనంతరం ఎన్నెస్పీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎన్నెస్పీ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నెస్పీ వారు ఎస్‌జీటీ రామచంద్రారెడ్డికి ఈఈ–22 ఇంటిని కేటాయించారని, కోర్టు ఉత్తర్వుల మేరకే ఇంటిని స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

### కక్షగట్టి స్వాధీనం చేసుకున్నారు: చైర్‌పర్సన్

ఈ విషయమై మున్సిపల్ చైర్‌పర్సన్ కర్ర అనూష మాట్లాడుతూ తమపై కక్షగట్టిన ఎన్నెస్పీ అధికారులు కుట్ర పన్ని తమ ఇంటిని స్వాధీనం చేసుకున్నారన్నారు. 2015 నుంచి తాము ఇదే ఇంట్లో నివాసం ఉంటున్నామని, 59 జీఓ ప్రకారం 2021 నుంచి నివాసం ఉండే వారికే ఇండ్లను కేటాయించాల్సి ఉన్నదన్నారు. కానీ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా ఇటువంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ఎస్‌జీటీగా పని చేస్తున్న ఉద్యోగికి ఈఈ స్థాయి ఇంటిని ఎన్నెస్పీ అధికారులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ బీసన్న, ఎస్‌ఐలు సురేశ్, సంపత్‌గౌడ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకోవాలి : ఏఓ కల్యాణచక్రవర్తి

దామరచర్ల, డిసెంబర్ 14 : రైతులు యాసంగిలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి బి. కల్యాణచక్రవర్తి సూచించారు. గురువారం మండలంలోని కొండ్రపోల్ గ్రామ రైతువేదికలో యాసంగి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వరి సాగుచేసి ఇబ్బందులు పడొద్దన్నారు. దానికి బదులుగా ఆరుతడి పంటలైన మినుములు, పెసర, జొన్న, ఉలవలు, రాగులు లేదా పశుగ్రాసం సాగుచేయాలని సూచించారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సదస్సులో గ్రామ సర్పంచ్ రాంబాబు, ఏఈఓ ఎం. రమేశ్, రైతులు పాల్గొన్నారు.


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు, మాలధారులు

# వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

హాలియా, డిసెంబర్ 14 : హాలియా కోదండ రామాలయంలో గురువారం అయ్యప్పస్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌శక్తి జాగరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయప్రోలు మురళీ గురుస్వామి, అఖిలభారత అయ్యప్ప సేవాసమితి రాష్ట్ర నాయకుడు మేడేపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సత్యనారాయణ గురుస్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడిపూజకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు అన్నదానం చేసేందుకు సహకరించిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, స్థానిక వ్యాపారి రేపాల వెంకన్న, రామాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు కాకునూరి నారాయణ, కుక్కడాల చంద్రమౌళిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పురోహితులు రమణశర్మ, రామానుజం వెంకటాచార్యులు, భీష్మాచార్యులు పాల్గొన్నారు.

## 'పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి'


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అడవిదేవులపల్లి, డిసెంబర్ 14 : విద్యార్థినులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి, చదువుపై దృష్టిసారించాలని కస్తూర్బా ఎస్‌ఓ నాగలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. చదువుకునే ఆడపిల్లలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, వాటికి భంగం కలిగించే వారిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. సోషల్ మీడియా వల్లే పిల్లలు పెడదోవ పడుతున్నారని, దానిని మంచి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 14 : సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 122 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి నట్లు సంస్థ కన్వీనర్ చిల్లంచర్ల ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సమితి సేవకులు పాల్గొన్నారు.